BHARATH SAMACHAR DIGITAL

7, నవంబర్ 2026, శనివారం

భారత్ సమాచార్

కౌంటింగ్‌కు ముందే మృతి.. ఎన్నికల్లో గెలుపు..



భారత్ సమాచార్, అమరావతి : కౌంటింగ్‌కు ముందే గుండెపోటుతో మరణించిన ఓ మహిళా అభ్యర్థి ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించడం తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎన్నికల్లో గెలిచిన ఆనందాన్ని స్వయంగా ఆస్వాదించలేకపోయిన ఆమె ఉదంతం స్థానికులను కలచివేస్తోంది. జనసేన పార్టీ తరపున ఎంపీటీసీగా పోటీ చేసిన గారపాటి దివ్య.. వైసీపీ అభ్యర్థిపై 352 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అయితే ఈ గెలుపు వార్త వెలువడే సమయానికి ఆమె ప్రాణాలతో లేకపోవడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది.

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం గ్రామానికి చెందిన దివ్య వయసు 28 సంవత్సరాలు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా ఆమె ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిశారు. అయితే పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఆమె మరణవార్తతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

మరోవైపు శనివారం వెలువడిన ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో దివ్య తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థిపై 352 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ప్రకటించారు. ఎన్నికల బరిలో నిలిచి ప్రజల మద్దతు పొందిన ఆమె.. విజయం సాధించిన విషయం తెలుసుకునే అవకాశం లేకుండానే కన్నుమూయడం అందరినీ కలచివేసింది. సాధారణంగా ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి ఇంట సంబరాలు జరగాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం గెలుపు వార్తతో పాటు విషాదం కూడా నెలకొంది.

దివ్యకు ప్రేమ వివాహం కాగా, ఐదేళ్లు, మూడు నెలల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నట్లు సమాచారం. చిన్న వయసులోనే ఆమె మరణించడంతో ఆ ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోయారు. ఒకవైపు ఎన్నికల్లో విజయం సాధించిందన్న వార్త.. మరోవైపు ఆమె ఇక లేదన్న నిజం కుటుంబ సభ్యులను, గ్రామస్థులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ప్రజాసేవ చేయాలనే ఆశతో ఎన్నికల్లో పోటీ చేసిన దివ్యకు ఓటర్లు విజయాన్ని అందించినా, ఆ విజయాన్ని ఆమెతో పంచుకునే అవకాశం లేకపోవడం ధుమంతునిగూడెం గ్రామంలో విషాదాన్ని నింపింది.

© 2026 Bharath Samachar